ప్రజాశక్తి

ఆదివారం 1 జనవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నూతన సంవత్సర వేళ..
ఉక్కు సంకల్పం



మద్దిల పాలెంలో



ఉక్కు జ్యోతి వెలిగించిన పుణ్యవతి

విశాఖలో పలుచోట్ల 'సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట ముగ్గులు
ఉద్యమ స్ఫూర్తి చాటుకున్న ప్రజానీకం

ప్రజాశక్తి - విశాఖపట్నం : 2023 వచ్చేసింది. ఈ నూతన సంవత్సర వేళ ఎక్కడ చూసినా 'ఉక్కు' చైతన్యం కనిపించింది. నగర వాసులు ఇళ్ల ముందు 'సేవ్ వైజాగ్ స్టీల్.. సేవ్ పబ్లిక్ సెక్టార్' పేరిట రంగుల ముగ్గులు వేశారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొన్నిచోట్ల రంగు రంగుల విద్యుద్దీపాలను సేవ్ వైజాగ్ స్టీల్ అక్షరాల చుట్టూ అమర్చారు. కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం వద్ద ఐద్వా జాతీయ నేత ఎస్.పుణ్యవతి ఉక్కు జ్యోతిని వెలిగించారు.



జగదాంబలో



తోకాడలోని సమైక్య అపార్టుమెంట్ వద్ద..

మానవత్వం లేని మనిషి జగన్



మాట్లాడుతున్న బండారు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మానవత్వం లేని మనిషి అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్య నారాయణమూర్తి అన్నారు. శనివారం విశాఖ నగరంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏదైనా దుర్ఘటన జరిగి ఎవరైనా చనిపోతే సానుభూతి చూపు తారన్నారు. కానీ కందుకూరు దుర్ఘటన పట్ల జగన్‌లో సానుభూతి వ్యక్తం కాలేదన్నారు. దీనిపై మోడీ ప్రకటన చేసిన తర్వాత మాత్రమే జగన్ స్పందించారని చెప్పారు. రాయలసీమలో జగన్ కుటుంబం ఎందరినో పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. తన రాజకీయాల కోసం అశు వులు బాసిన వారిని జగన్ ఆదుకోలేదన్నారు. ఆ కుటుంబాలను సైతం తమ పార్టీ అధినేత చంద్రబాబు ఆదుకున్నారని గుర్తు చేశారు. జగన్ పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన సభల్లో పలువురు చనిపోయినా వారికి ఒక్క రూపాయి ఇవ్వలేదని తెలిపారు. సొంత బాబాయ్ ఎలా చనిపోయాడో జగన్

మిగతా 2లో..

సుగర్ ఫ్యాక్టరీల ఊసేది ?

- కార్మికుల బకాయిలపై దక్కని భరోసా
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతినీ మరిచిన జగన్
- నిరాశపరిచిన సిఎం నర్సీపట్నం పర్యటన

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని శుక్రవారం నర్సీపట్నం పర్యటనలో చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడే ప్రధానాంశాలను విస్మరించారు. తాను చెప్పాలనుకున్న విషయాలకు, చేయాలనుకున్న విమర్శలకు ఇచ్చిన ప్రాధాన్యత.. గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాలు మెరుగుపడేందుకు దోహదపడే సహకార చక్కెర ఫ్యాక్టరీల ఆధునికీకరణ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనుల పురోగతిపై ఇవ్వలేదు. కనీసంగానైనా మాట్లాడలేదు. మూడు సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డంతో గ్రామీణ ప్రాంతంలో చెరుకు పంట విస్తీర్ణం తగ్గింది. సహకార ఫ్యాక్టరీలను ఆధునికీకరించి క్రషింగ్ పునరుద్ధరిస్తే రైతులకు ఎంతో మేలు జరిగేది. ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలు చెల్లించలేదు. ఏటికొప్పాక కార్మికులకు రూ.8 కోట్లు, తాండవ ఫ్యాక్టరీ కార్మికులకు రూ.8.50 కోట్లు

మిగతా 2లో..



శుక్రవారం జరిగిన సభలో మాట్లాడుతున్న జగన్

కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా అశోక్ కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్)కు నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.అశోక్ కుమార్ నియమితులయ్యారు. ఇంతవరకూ ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ పి.మైథేలి శనివారంతో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆమె స్థానంలో గుంటూరు మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ పి.అశోక్ కుమార్‌ను ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణం ఆయన విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

సుగర్ ఫ్యాక్టరీల ఊసేది ?

బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాల్లో పిల్లలను చదివించుకోలేని పరిస్థితి ఏర్పడింది. కార్మికుల జీతాలు చెల్లింపు విషయం, ఫ్యాక్టరీల ఆధునికీకరణాంశం విషయాలను సిఎం తన సభలో ప్రస్తావించలేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో 8 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనుల విషయాన్నీ విస్మరించడంతో ప్రజలు నిరాశ చెందారు. నర్సీపట్నం ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని అధికార పార్టీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ చేసిన విజ్ఞప్తిపై కూడా సిఎం స్పందించలేదు.

బకాయిలపై హామీ ఇస్తారనుకున్నాం



ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిల చెల్లింపుపై సిఎం హామీ ఇస్తారనుకున్నాం. 18 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పిల్లలను చదివించు కోలేకపోతున్నాం. ఏటికొప్పాకలో 300 మంది కార్మికులకు రూ.8 కోట్లు, తాండవలో 300 మందికిపైగావున్న కార్మికులకు రూ.8.50 కోట్లు చెల్లించాల్సివుంది. రిటైర్‌మెంట్ సదుపాయాలు కార్మికులకు ఇవ్వలేదు. జాబ్‌కార్డులేక ఉపాధి పనులు ఇవ్వడం లేదు. బకాయిలు పూర్తిగా చెల్లించాలి. క్రషింగ్ నిలిపివేసిన కాలంలో ప్రతినెలా సగం జీతం కార్మికులకు చెల్లించాలి.

గుండుబోగుల గోవిందరావు,
ఏటికొప్పాక సహకార చక్కెర ఫ్యాక్టరీ శ్రామిక యూనియన్ ప్రధాన కార్యదర్శి

చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరించాలి




మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి, క్రషింగ్ పునరుద్ధరణ చర్యలు చేపట్టకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడివుందని సిఎం చెప్పడం ప్రజలను మోసగించడమే. నాలుగు సుగర్ ఫ్యాక్టరీల్లో ఒకటి టిడిపి ప్రభుత్వం, రెండు వైసిపి ప్రభుత్వ కాలంలో మూతపడ్డాయి. జిల్లా అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధివుంటే చక్కెర ఫ్యాక్టరీల క్రషింగ్ పునరుద్ధరించాలి. కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తిచేసి సాగునీటి సౌకర్యం కల్పించాలి.

ఎం.అప్పలరాజు, ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

మానవత్వం లేని మనిషి జగన్

చెప్పాలని డిమాండ్ చేశారు. బాబాయ్ హత్యతో తనకు ప్రమేయం లేదని, తాను నమ్మిన జీసస్‌పై జగన్ ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. సొంత తండ్రి చనిపోతే శవం పక్కనే రాజకీయాలు చేసిన చరిత్ర ఆయనదని ఎద్దేవా చేశారు. జగన్ అవగాహనా రాహిత్యం వల్లే గోదావరిలో బోటు ప్రమాదం జరిగి అనేకమంది చనిపోయారన్నారు. ఆయన చరిత్ర హత్యలతో నిండిపోయిందని, అటువంటి వ్యక్తి మానవత్వం గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. నర్సీపట్నం సభలో శవ రాజకీయాల గురించి మాట్లాడటం సరికాదన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల సాగునీటికి అవసరమైన సుజల స్రవంతి ప్రాజెక్టును జగన్ గాలికి వదిలేసారని విమర్శించారు



దీక్షల్లో కూర్చున్న సిఐటియు నాయకులు

ఉక్కును అమ్మే అధికారం మోడీ ప్రభుత్వానికి లేదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒక్కదానినీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, అటువంటప్పుడు ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే అధికారం ఎక్కడిదని సిఐటియు ఆరిలోవ జోన్ కార్యదర్శి నరేంద్ర కుమార్ ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారానికి 639వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఆరిలోవ, మద్దిలపాలెం, మధురవాడ జోన్ సిఐటియు నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నందునే విశాఖపట్నం మహా నగరంగా అభివృద్ధి చెందిందని, లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. వీటిని ప్రైవేటీకరణ చేస్తే ఉపాధికి భంగం కలగడమే కాకుండా, రిజర్వేషన్లు లేకుండా పోతాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు, మధురవాడ జోన్ కార్యదర్శి పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం చారిత్రక పిలుపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం.. లేదంటే అమ్మేయడం అనే కేంద్రంలోని బిజెపి విధానాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ విశాఖ కార్మికవర్గం, ప్రజానీకం సాగనిచ్చేలా లేదన్నది స్పష్టంగా రూఢీ అవుతోంది. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోడానికి ప్రజా ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేయాలని గత నెల 22, 23 తేదీల్లో జరిగిన సిఐటియు 12వ విశాఖ జిల్లా మహాసభలు దిశానిర్దేశం చేశాయి. ఇదో చారిత్రకమైన స్ఫూర్తిదాయక పిలుపుగా అన్ని రంగాలకు చెందిన కార్మికులూ భావిస్తున్నారు. 689 రోజులుగా స్టీల్‌ప్లాంట్ ముఖ ద్వారం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద కార్మిక దీక్షలు సాగుతున్న సంగతి తెలిసిందే. 2023 జనవరి 27 నాటికి కేంద్రంలోని మోడీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్నట్లు ప్రకటించి రెండేళ్లు కావొస్తున్న సందర్భంగా ఆ రోజు భారీ ఎత్తున 'ఉక్కు ప్రజా గర్జన' సభ నిర్వహించడానికి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. దీంట్లో అన్ని పార్టీలు, అన్ని ప్రజా సంఘాల నాయకులూ పాల్గొననున్నారు.

ఇకపై ప్రజల్లోకి స్టీల్‌ప్లాంట్ కార్మికులు, సంఘాలూ..

స్టీల్‌ప్లాంట్ అంటే ఏ సిమెంట్ ఫ్యాక్టరీయో... అగ్గిపుల్లలు తయారు చేసే కంపెనీయే కాదు' అన్నది ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు, బిజెపి మినహా మిగతా అన్ని రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలూ బలంగా నమ్ముతున్నాయి. దీన్ని ఎలాగైనా కాపాడుకుని తీరాలన్న కాంక్షతో ఉత్తరాంధ్ర, యావత్ ఎపి మొత్తం మీద ప్రజలందరిలోకి ఈ ఉద్యమాన్ని తీసుకెళ్లాలన్న ధృఢ నిశ్చయంతో తాజాగా కదులుతున్నారు. ఇది 26 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భారీ పరిశ్రమ. దేశంలోనే సముద్ర తీరంలో ఉన్న ఏకైక ఉక్కు కంపెనీ. విశాఖకు ఇంత పేరు రావడానికి ప్రధాన కారణం ఈ పరిశ్రమే. దీన్ని ఎలాగైనా ప్రైవేట్ ఉచ్చు నుంచి కాపాడేందుకు సిఐటియు, సిపిఎం, ప్రజా సంఘాలు తొలినుంచీ కంకణం కట్టుకుని పోరాటంలో అగ్రభాగాన నిలబడ్డాయి. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పేర కార్మిక సంఘాలన్నీ స్టీల్‌ప్లాంట్ ఏరియాలో ఏకం అయితే... విశాఖ కేంద్రంగా అఖిలపక్ష కార్మిక సంఘాలను ఏకం చేసి సిఐటియు పోరాడుతోంది. 32 వేల మంది



ప్రత్యక్షంగానూ, మరో లక్ష కుటుంబాలు పరోక్షంగా స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడే జీవనం సాగిస్తున్నాయి. ఎపిలో ఏకైక అతిపెద్ద భారీ పరిశ్రమగా వెలుగొందుతోంది. 1960వ దశకంలో 32 మంది యువకుల రక్తతర్పణతో ఏర్పడిన స్టీల్ ఇండస్ట్రీ ఇది. ప్రారంభ సమయంలో రూ.5 వేల కోట్లే కేంద్రం పెట్టుబడి పెట్టగా ఇంతవరకూ స్టీల్‌ప్లాంట్ రూ.43 వేల కోట్ల రూపాయలకు పైగా పన్నులు, డివిడెండ్ల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించింది. వైజాగ్ స్టీల్‌కు సొంత గనులను కేటాయించకుండా కేంద్రంలోని బిజెపి 2014 నుంచీ తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. సొంత గని ఉంటే టన్ను ఐరన్ ఓర్‌కు రూ.600 ఖర్చుచేస్తే సరిపోతుంది. సొంత గనుల్లేనందున టన్నుకు రూ.6 వేల వరకూ ఖర్చు చేయాల్సిన దుస్థితిలో ప్లాంట్ పడింది. దీంతో సహజంగానే కొంతకాలం నష్టాల్లోకి వెళ్లింది.

రాజకీయ డ్రామాలు

'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' అంటూ యావత్తు తెలుగు ప్రజానీకం 689 రోజులుగా గగ్గోలు పెడుతున్నా బిజెపి పాలకులు కళ్లుండీ కబోధుల్లా వ్యవహరించడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు బిజెపి ఎంపిక చేసిన జివిఎల్.నరసింహారావు విశాఖలో తిష్టవేసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, అమ్మకం చేసే దిశగా తెరవెనుక ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారంగా ఉంది.

విశాఖ నుంచి బిజెపి తరపున పార్లమెంట్ సభ్యునిగా పోటీ చేస్తున్నట్లు ఫోకస్ ఇస్తూనే... మరోవైపు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పలు కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు చేపడుతోన్న ఆందోళనలను చల్లార్చే ప్రయత్నాలు సాగించడం తేటతెల్లమైంది. అసలు సమస్య అయిన ప్రైవేటీకరణ అంశం నుంచి దృష్టిని మరల్చే పనులకే జివిఎల్ ప్రాధాన్యతిస్తున్నారు. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ కార్మికవర్గం మాత్రం స్ఫూర్తిదాయక పోరాటాలను నిర్వహిస్తోంది.

2023 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ 'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి.... కొత్త సంవత్సరంలో ప్లాంట్ పరిరక్షణకు మరింత ఉద్యమం చేపట్టాలి'... అని రంగుల హరివిల్లు, ముగ్గులను వేసేందుకు స్టీల్‌ప్లాంట్, విశాఖ నగరంలోని మహిళాలోకం సిద్ధమైంది. ఉద్యమ స్ఫూర్తితో హ్యాపీ న్యూ ఇయర్ వేడుకలను చేపట్టింది. ప్రజలంతా ఉద్యమంలో పాల్గొని తమ పోరాటానికి మద్దతివ్వాలంటూ కొత్త సంవత్సరాదికి ఘనంగా కార్మికులంతా స్వాగతం పలకడం చూస్తే 'తగ్గేదే లే' అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి.

60 అడుగుల వెడల్పుతో మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు జంక్షన్ మీదుగా క్వీన్ విక్టోరియా విగ్రహం వరకు ఉన్న రోడ్డును 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలని జివిఎంసి తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ రోడ్డు అభివృద్ధిపై అభ్యంతరాలు, సూచనలు కోరుతూ ఈ మధ్య 15 రోజులు గడువును ఇచ్చింది. ఆ గడువు కూడా ముగిసి వారం రోజులు అయింది. పలు అభ్యంతరాలు, సూచనలు వచ్చాయి. ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు డెవలప్‌మెంట్ మేరకు ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. దాదాపు నాలుగేళ్ల క్రితం మెయిన్ రోడ్డు వెడల్పుకు అప్పటి ప్రభుత్వం సన్నాహాలు చేసింది. రోడ్డు విస్తరణలో భవనాలు, వివిధ కట్టడాలు కోల్పోనున్న అనేక మందితో అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పలు సమావేశాలు నిర్వహించారు. వంద అడుగుల వెడల్పుతో రోడ్డును అభివృద్ధి చేయాలని భావించారు. తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు రావడంతో 80 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీనికి కూడా అభ్యంతరాలు అధికంగా వచ్చాయి. ఈ నేపథ్యంలో 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలని ఎక్కువమంది సూచించారు. దీంతో అప్పటిలోనే 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధికి ప్రయత్నించారు. ఏ కారణం చేతనో అది ఆచరణకు నోచుకోలేదు. ఈ పూర్వ రంగంలో మరోసారి 60 అడుగుల వెడల్పుతో రోడ్డు అభివృద్ధి విస్తరణకు జివిఎంసి సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికైనా రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హేమసుందర్‌కు ఎన్‌టిఆర్ స్మారక పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నేమాల హేమసుందర్‌కు దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ అయిన విశాఖ రత్న కళాపరిషత్ డాక్టర్ నందమూరి తారక రామారావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలను విశాఖరత్న కళా పరిషత్, డాక్టర్ నందమూరి తారక రామారావు నాటకోత్సవాల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ నగరంలో ఏడాది పాటు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ప్రతి నెలా కళాకారులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి ఎన్‌టిఆర్ స్మారక పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. అందులో భాగంగా ఎనిమిదో నెల కార్యక్రమాన్ని ఉపకార గ్రూపు అధినేత కంచర్ల అచ్యుతరావు సహకారంతో ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఎసి ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు హేమసుందర్‌ను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు పి.ఎ.భాస్కరరావు, అతిథులు గోడి నరసింహాచారి, విజయలక్ష్మి దంపతులు, సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్, కుమార్ నాయక్, తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.



హేమసుందర్‌ను సత్కరిస్తున్న అతిథులు

అమూల్ అవుట్ లెట్ల అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగర పరిధిలో గుజరాత్‌కు చెందిన అమూల్ సంస్థకు ఫుట్‌పాత్‌లపై 103 చోట్ల అవుట్‌లెట్ల ఏర్పాటుకు జివిఎంసి ఇచ్చిన అనుమతులను తక్షణం రద్దు చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ డిమాండ్ చేశారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో రోడ్డు పక్కన అనేక సంవత్సరాలుగా చిన్న చిన్న బడ్డీలు పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారుల బడ్డీలను తొలగిస్తున్న జివిఎంసి అమూల్ సంస్థకు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. లోకల్ డైరీలను దెబ్బతీయటానికి జగన్ కుట్రకు పాల్పడ్డారని, అందులో భాగంగానే అమూల్ అవుట్ లెట్లకు అనుమతులు ఇచ్చారని విమర్శించారు. జగన్ అమూల్ సంస్థకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖలో అధికారులు అమూల్‌కి బానిసలుగా మారారన్నారు. అమూల్ దేశ, విదేశాల్లో బాగా ఆర్థిక పరిపుష్టితో ఉన్న సంస్థని తెలిపారు. అటువంటి అమూల్‌ను ప్రమోట్ చేసే బాధ్యతను జగన్ భుజాలపై వేసుకున్నారన్నారు. అందుకే అఫీషియల్‌గా జీవో విడుదల చేశారన్నారు.

సిపిఎం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విఆర్.పురం : కొంతకాలంగా అనారోగ్యంతో పాటు మతిస్థిమితం కోల్పోయి చికిత్స పొంది కోలుకొని ఇంటికి చేరిన మండల కేంద్రం రేకపల్లి గొల్లగూడెం ఎస్‌టి కాలనీకి చెందిన కట్టం శ్రీరామ్మూర్తికి సిపిఎం ఆర్థిక సాయం అందించింది. రూ.2వేలు నగదు, పండ్లను ఎంపీపీ కారం లక్ష్మి, రేకపల్లి సర్పంచ్ పూనెం సరోజిని చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు పంకు సత్తిబాబు, సరిహద్దు వెంకన్న, సోల వినోద్ పాల్గొన్నారు.

కలగానే ఆర్టీసీ బస్ కాంప్లెక్స్

ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే నినాదం..
పాలకుల్లో కొరవడిన చిత్త శుద్ధి?



ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఉన్న స్థలం

ప్రజాశక్తి -తగరపువలస

ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఏర్పాటు నేటికీ కలగానే మిగిలిందని చెప్పవచ్చు. జనాభాతో పాటుగానే ప్రజల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా సదుపాయాలు లేవు.

ట్రాఫిక్ సమస్య జటిలం

పట్టణంలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే బస్సులు హైవే మీదుగా వెళ్తున్నాయి. 222, 111, 55టి తదితర సిటీ బస్సులు లెక్కకు మిక్కిలిగా వస్తూ వెళ్తుంటాయి. కారణాలు ఏవైనా గానీ రోజు రోజుకూ రోడ్డు కుచించుకు పోవడంతో వస్తున్న సిటీ బస్సులు సైతం జంక్షన్‌లో మలుపు తిప్పేందుకు అవకాశం లేక శివాలయం ఎదురుగా ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ప్రతిపాదిత స్థలం వద్ద మలుపు తిప్పుతున్నారు. మరికొన్ని బస్సులను స్థానిక పాత అన్నా క్యాంటీన్ పక్కనున్న ఖాళీ స్థలంలో మలుపుతిప్పుతున్నారు. స్థానిక జంక్షన్‌లో ఎక్కువ సమయం బస్సులు నిలిపే అవకాశాలు లేవు. ఆటోలు, టాక్సీలు, క్యాబ్‌లు, కూడా ప్రయాణికుల కోసం అక్కడనే నిలుపుతారు. అసలే ఇరుకైన రోడ్డు, అందునా ఇక్కడి జంక్షన్ నిత్యం రద్దీగానే ఉంటుంది. పద్మ వ్యూహాన్ని తలపించే ట్రాఫిక్‌లో బస్సును ఎక్కువ సమయం నిలపడం సాధ్యం కాదు. బస్ కాంప్లెక్స్ ఉన్నట్లయితే నిదానంగా బస్సు ఎక్కుతారు. బస్సు ఎక్కువ సమయం ఆగే పరిస్థితి లేనందున అటు శివాలయం, ఇటు అన్నా క్యాంటీన్ నుంచి వచ్చే బస్సుల్లో సీటు కోసం ప్రయాణికులు పరుగెడుతూ ఎక్కే సమయంలో ఎన్నో సార్లు, ఎంతోమంది ప్రమాదాలకు గురైన సందర్భాలు లేక పోలేదు.

ఇక్కడ బస్ కాంప్లెక్స్ నిర్మిస్తామంటూ ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజలకు హామీ ఇస్తూనే ఉన్నారు. అదిగో, ఇదిగో అంటూ ఏళ్ల తరబడి కాలయాపన చేస్తూ వచ్చారు. ఎన్నికల్లో గెలిచాక శంకుస్థాపనలతో సరిపెట్టేస్తున్నరన్నది వాస్తవం. ఇప్పటికైనా బస్సు కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, పాలకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాలకుల్లో కొరవడిన చిత్త శుద్ధి?

ఏళ్ల తరబడిగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్న ప్రజాప్రతినిధుల్లో చిత్త శుద్ధి కొరవడడం వల్లనే ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ఏర్పాటు నేటికీ కలగానే మిగిలిందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. టిడిపి, కాంగ్రెస్, వైసిపిలకు చెందిన నేతలు ఎమ్మెల్యే, మంత్రి పదవులు చేపట్టినా సరే ఆర్టీసి బస్సు కాంప్లెక్స్ ఏర్పాటు జరగలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు.

బస్ కాంప్లెక్స్ నిర్మించాలి

స్థానికంగా ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ నిర్మించాలి. అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, సత్వరమే బస్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి.



కె.శేఖర్
తగరపువలస

కాంప్లెక్స్ అవసరం

ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో ఆర్టీసి బస్సు కాంప్లెక్స్ ఏర్పాటు ఎంతైనా అవసరం. స్థానిక ప్రజలు, ప్రయాణికుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలి.



ఎస్.రామలక్ష్మి
తగరపువలస

బ్యాడ్మింటన్ విజేతలకు ట్రోఫీ అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు స్కిల్ డెవలప్‌మెంట్ వద్ద నిర్వహించిన వైఎస్ఆర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలకు శనివారం వైసిపి సీనియర్ నాయకులు అక్కరమాని వెంకటరావు, వార్డు అధ్యక్షులు కెల్ల సత్యనారాయణ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పిల్లి వీర్రాజు, బేత దుర్గారావు, వెంకటరెడ్డి, పాండ్రంకి శ్రీను, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి పరిధి సంగివలస రాళ్లగుట్ట, శ్మశాన వాటిక సమీపం సర్వే నంబర్ 89/2లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం సుమారు 45 సెంట్లను తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఆక్రమణదారులు శిక్షార్హులు అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎంఆర్ఐ రాజేటి రఘురాం, విఆర్ఒలు సాయిరాజ్, పైడిరాజు, గ్రామ సేవకులు ఆధ్వర్యాన ఆక్రమణలు తొలగించారు.

55వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 55వ వార్డు పరిధి రెడ్డి తాటిచెట్లపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజు, వార్డు కార్పొరేటర్ కెవివిఎస్ శశికళ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : హాజీ అబ్బాస్ హుస్సేన్ ఆర్థిక సాయంతో ముస్తాఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన, 11వ వార్డు పరిధి కనకదుర్గానగర్ విశాఖ ముస్లిం మదర్సలో శనివారం పేద వృద్ధులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక సందర్భాల్లో కుల, మత బేధం లేకుండా అందరికి సహాయ సహకారాలు అందిస్తున్న అబ్బాస్ హుస్సేన్‌ను అభినందించారు. ముస్లిములకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కాలేషా, కార్యదర్శి అక్బర్ అలీ, కోశాధికారి జానీ, టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, మూది అప్పారావు, ముగడ రాజారావు పాల్గొన్నారు.



వృద్ధులకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

బోయపాలెంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం బోయపాలెంలో మాజీ సర్పంచ్ వానపల్లి ముత్యాలరావు ఆధ్వర్యాన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోరాడ రాజబాబు రచ్చబండ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో దల్లి రాంబాబు, డెక్కన అప్పల గురువులు, బొట్ట నరసింహారావు, తెడ్లాపు పెద్ద ఎర్రయ్య, ఉజ్జూరు మహేశ్వరరావు, బొట్ట శ్రీను, తెడ్లాప్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక వలందపేటకు చెందిన తన భర్త పైడిరాజు (34) ఈ నెల 30వ తేదీ నుంచి కనిపించడంలేదని ఆయన భార్య వంకా జ్యోతి ఈ నెల 30న భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 29వ తేదీ రాత్రి పైడిరాజు, జ్యోతి, ఇద్దరు పిల్లలు ఇంట్లో నిద్రపోయారు. 30వ తేదీ ఉదయం 6 గంటలకు భార్య నిద్ర లేచి చూసే సరికి భర్త కనబడలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. పైడి రాజు టైల్స్ కాంట్రాక్ట్ వర్క్ చేస్తున్నాడు. హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస, సర్వీస్ రోడ్డు వద్ద ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా భోగాపురం మండలం, గుడివాడ గ్రామానికి చెందిన చీడి బంగారమ్మ (40) కూలి పని చేస్తుంటుంది. ఈ క్రమంలో మేస్త్రి అచ్చిబాబుకు చెందిన ద్విచక్రవాహనంపై గుడివాడ వస్తూ మార్గమధ్యలో తాళ్లవలస సర్వీస్ రోడ్డులో వెనుక నుంచి వస్తున్న పల్సర్ బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సింహ చలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో జనసేన నేత అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలికను లైంగికంగా వేధిస్తూ దాడికి పాల్పడిన జనసేన నేత రాఘవరావును పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను ఈస్ట్ ఎసిపి మూర్తి శనివారం మీడియాకు వెల్లడించారు. చినవాల్తేరులోని ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న బాలిక బుధవారం రాత్రి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంది. అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న జనసేన నేత రాఘవరావు ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. లైంగికంగా అనుకూలంగా ఉండమని మద్యం మత్తులో కోరాడు. ఆమె నిరాకరించడంతో లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఫ్లాట్‌లో నుంచి తనతో బయటకు రావాలని వేధించడంతో ఆందోళనకు గురైన బాలిక స్నేహితులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. బాధితురాలి ఫిర్యాదుతో రాఘవరావుపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. కొంతకాలంగా బాలికను రాఘవరావు వేధింపులకు గురిచేస్తున్నాడని, వాట్సాప్‌లో అసభ్య మెసేజ్‌లు పంపుతున్నాడని పోలీసులు తెలిపారు. సమావేశంలో సిఐ కోరాడ రామారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. డొంకాడ నుండి జి.అప్పలనాయుడు, ఎం.నూకరాజు బైక్‌పై తుని వైపు వెళ్తున్నారు. నక్కపల్లి వైపు నుండి ఎ.రాము బైక్‌పై తుని వెళు తున్నాడు. గొడిచెర్ల జంక్షన్ వద్ద ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వాహన సిబ్బంది శ్రీనివాస్, రాము తెలిపారు.

రక్తదానం చేయాలి

ప్రజాశక్తి- గాజువాక : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని గాజువాక ఆటోనగర్ సెయింట్ అలోసిస్ ఐటిఐ ప్రిన్సిపల్ ఫాదర్ మాథ్యూ వెంపల, ఫాదర్ జోసెఫ్ జడ్డు, ఫాదర్ మరియాదాస్ కోరారు. ఐటిఐలో చదువుతున్న విద్యార్థులు 100 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరోనా సమయంలో రక్తం దొరకక పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఏటా తమ ఐటిఐలో రక్తదానం చేస్తున్నట్లు చెప్పారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు



గ్రీన్ డే లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజ్ఞాన్ బ్రిలియంట్‌లో ఇంటర్నేషనల్ గ్రీన్ డే

ప్రజాశక్తి-గాజువాక : అగనంపూడి పరిధి కొండయ్యవలసలోని శ్రీ విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్‌లో ఇంటర్నేషనల్ గ్రీన్ డే నిర్వహించారు. కరస్పాండెంట్ కెవి.సత్యనారాయణ పిలుపు మేరకు పాఠశాల ఆవరణలో విద్యార్థులు పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ కె.పద్మావతి మాట్లాడుతూ, కాలుష్య రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని కోరారు. ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు కానుకగా పాఠశాలకు ఒక పూల మొక్కను ఇవ్వాలని, ఇంటిలో కూడా ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షిస్తామంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆడారి తులసీరావు కోలుకోవాలని రామకృష్ణాపురంలో పూజలు

ఆడారి తులసీరావు ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

ప్రజాశక్తి - ములగాడ : విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు ఆరోగ్యం మెరుగుపడాలని 59, 61వ వార్డు కార్పొరేటర్లు కొణతాల సుధ, పుర్రె పూర్ణశ్రీ ఆధ్వర్యాన రామకృష్ణాపురంలోని కోదండ రామాలయం వద్ద, గాజువాక డిపో సమీపంలోని అభి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 116 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడారి తులసీరావు సంపూర్ణ ఆరోగ్యతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 59వ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు. కలిదిండి బద్రీనాథ్, ఎన్‌వి.రమణ, పిలక రామ్మోహన్‌రెడ్డి, నూక రెడ్డి, చట్టి.నూకరాజు, బాలు, బుస అప్పలరెడ్డి, సోను, అనంత్ కుమార్, విజయ్, రవి దాసరి రవి, పిలక వర, మంగ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు, మెడల్స్ అందుకున్న విద్యార్థులతో ఇన్‌ఛార్జి రవి, ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కూర్మన్నపాలెం : అజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా మహాత్మాగాంధీ రాజ భాష హిందీ ప్రచార్ సంస్థ నిర్వహించిన హిందీ పరీక్షల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను న్యూ హారిజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ కాశీ దేముడు, స్కూల్ ఇన్‌ఛార్జి రవి అభినందించారు. ఈ మేరకు విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందించారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయులు మహమ్మద్ హమీద్‌దున్నీషాబేగం, జమీర్ అఫ్‌సా ఆధ్వర్యాన ఈ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి చేపలుప్పాడ, చిన ఉప్పాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైసిపి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైలుకు దత్తపుత్రుడు జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : చంచల్‌గూడ జైలుకు జగన్మోహన్‌రెడ్డి దత్త పుత్రుడైతే, ప్రజలకు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ అని జనసేన పార్టీ నాయకులు కోన తాతారావు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కోన తాతారావు మాట్లాడుతూ, నర్సీపట్నంలోని సభలో కేవలం పవన్, ఇతర ప్రతి పక్ష నేతలను వ్యక్తి గతంగా దూసించడానికే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిమితమవటం చూస్తుంటే ఆయనలో ఓటమి భయం కనబడుతోందన్నారు. అదే స్థాయిలో ప్రజలను మభ్యపెట్టి మాట్లాడారన్నారు. పవన్ కల్యాణ్ మూడు పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయలేక పోతున్నారా? ఉత్తరాంధ్ర సృజల స్రవంతి ప్రాజెక్ట్ మొదలు పెట్టలేక పోతున్నారా అంటూ ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ నాయకత్వంపై నమ్మకంతో ప్రజలు సభలకు వస్తున్నారని, జగన్మోహన్‌రెడ్డి పాలనపై వ్యతిరేకతతో ఆయన సభలకు ప్రజలు రానందునే డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలను, సచివాలయ సిబ్బందిని తరలిస్తున్నారని ఆరోపించారు. జగన్‌రెడ్డి ఆర్థిక నేరాలతో సిబిఐ కేసులో ఉన్న అయోధ్య రామిరెడ్డి, పార్థసారథిరెడ్డి, విజయసాయిరెడ్డి లాంటి వారు నిర్మాతలుగా ఉంటే పవన్ కల్యాణ్‌కు ప్రజలే నిర్మాతలని స్పష్టం చేశారు. కేంద్ర ఆరోగ్యశాఖ కేవలం 3 వైద్య కళాశాలలకు మాత్రమే అనుమతులిస్తే ప్రజలను మభ్య పెట్టేందుకు జగన్మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలంటూ నర్సీపట్నంలో శంకుస్థాపన చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో చోడవరం జనసేన ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషా కిరణ్ పాల్గొన్నారు.

'చెత్త' నాయకుడు

పెందుర్తి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజానాయకుడు కాదని, చెత్తకు పన్ను వేసిన చెత్త నాయకుడు అని జనసేన నాయకుడు శ్రీకాంత్ ఆరోపించారు. జివిఎంసి 88వ వార్డు పరిధిలోని నరవ జనసేన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పవన్ కల్యాణ్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి వ్యక్తిగత దూషణకు దిగుతున్నారని ఆరోపించారు. నర్సీపట్నంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడేటప్పుడు రాష్ట్ర భవిష్యత్తు, ప్రణాళికను వివరించకుండా, రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తామో చెప్పకుండా దత్తపుత్రుడు, ముగ్గురు భార్యలు అంతా మాట్లాడటం ముఖ్యమంత్రి దిగజారుడుకు నిదర్శనమనానరు. ప్రభుత్వ సభలను ఎన్నికల ప్రచారంగా వాడుకోవడాన్ని వ్యతిరేకించారు. ముందస్తుగా ప్రతిపక్ష నాయకులను, ప్రశ్నించిన ప్రజలను ఇంట్లో నిర్బంధించకుండా జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడా పర్యటించలేరన్నారు. ఈ బటన్‌రెడ్డితో ఆంధ్రప్రదేశ్ చరిత్ర ఎంతో వెనక్కి వెళ్లిపోయిందని ఆరోపించారు.

అప్పన్న నిత్యాన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో నిత్యాన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి పలువురు భక్తులు విరాళాలను దేవస్థానం అధికారులకు అందజేశారు. ఒడిశా బరంపురం ప్రాంతానికి చెందిన బికె.జగ్గారెడ్డి 1,01,116, విశాఖ ఎన్ఎడి ప్రాంతానికి చెందిన కాషా సంతోష్ రూ.లక్ష, కెసిభట్ల సత్యదేవ్, కృష్ణవేణి దంపతులు 1,00,116ను ఆలయ అధికారులకు అందజేశారు. విరాళ దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి దర్శనాన్ని కల్పించి, ప్రసాదం అందించారు. విరాళం మొత్తానికి బాండును అందజేశారు.

'ఉత్తరం'లో కెకె.రాజు గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి పలువురు కార్యాలయానికి వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందజేశారు. ఆ వినతి పత్రాలను పరిశీలించి, అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలపై సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎంవిఆర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విసి ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి-యంత్రాంగం

నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను జిల్లాలో పలు చోట్ల ఆవిష్కరించారు.

గాజువాక : గాజువాకలోని ఎంవిఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన క్యాలెండర్లను ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రామారావు పాల్గొన్నారు.

యాదవ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డు యాదవ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన 2023 క్యాలెండర్‌ను యూనియన్ నాయకులు మాడిసి రమణమూర్తి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాదవ కార్మికులందరూ ఐక్యమత్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మురళి, జోగిరాజు, నాయకులు పాల్గొన్నారు,

జర్నలిస్టుల డైరీ, క్యాలెండర్

సీతమ్మధార : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం 2023 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను సీతమ్మధారలోని విజెఎఫ్ వినోద వేదికలో శనివారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్‌తో పాటు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, పిసిపిఐఆర్ చైర్మన్ చొక్కాకుల లక్ష్మి, జిసిసి కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండ రమాదేవి హాజరై మాట్లాడారు. సభ్యుల సంక్షేమానికి వైజాగ్ జర్నలిస్టుల ఫోరం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. నూతన సంవత్సరంలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఆనందమయ జీవనం గడపాలని ఆకాంక్షించారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, దసరా, దీపావళి పండుగలు, మీడియా అవార్డుల ప్రధానోత్సవం తదితరాలను ఘనంగా నిర్వహించామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఏటా ఉపకార వేతనాలు అందజేస్తున్నామని చెప్పారు. తమ కార్యవర్గం హయాంలో కేవలం సభ్యుల వైద్య సదుపాయాల కోసం సుమారు 22లక్షలు వెచ్చించామన్నారు. నూతన సంవత్సర వేడుకలతో పాటు జనవరి 3 నుంచి జర్నలిస్టుల క్రీడా సంబరాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి దాడి రవికుమార్, ఉపాధ్యక్షులు ఆర్.నాగరాజ్ పట్నాయక్, ఫోరమ్ కార్యవర్గ సభ్యులు ఐరోతి ఈశ్వరరావు, ఎంఎస్ఆర్.ప్రసాద్, పి.వరలక్ష్మి, దొండ గిరిబాబు, డేవిడ్, శేఖర మంత్రి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్

భీమునిపట్నం : యుటిఎఫ్ -2023 క్యాలెండర్, డైరీని ఎంఇఒ కెవి.బాలామణి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.పైడిరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొట్టిపల్లి సత్యనారాయణ, యు.రాంబాబు, కార్యవర్గ సభ్యులు ఎల్ఎ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ బాలామణి

ఎపిటిఎఫ్

ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శనివారం ఆరిలోవలోని క్యాంపు కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శుభకృత నామ సంవత్సరంలో అంతా మంచే జరిగిందని, అదేవిధంగా శోభకృత్ నామ సంవత్సరంలో కూడా అంతా మంచే జరగాలని కోరుకుంటూ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షులు డి.శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ ఎస్‌పి.నాయుడు, జిల్లా ప్రెసెడెంట్ కె.శ్రీనివాసరావు, సెక్రటరీ టి.రామకృష్ణ తదితరలు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యాదవ అసోసియేషన్ సభ్యులు



విజెఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణలో...

డైట్‌లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి


స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా స్పాట్ ఈవెంట్స్, ఫ్లాష్ మోబ్‌తో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ కేక్ కట్ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో సరైన నిర్ణయాలు తీసుకుని విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ కె ఎస్ ఈశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి స్వీట్లు

జీవీఎంసీ 82వ వార్డు పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి, అధికారులకు వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారి కె.రజిని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతన వేడుకల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థులు


మాట్లాడుతున్న ఎపిజివిబి రీజనల్ మేనేజర్ ఉదయ కిరణ్

ఎపిజివిబిలో డిపాజిట్లపై అధిక వడ్డీ

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఖాతాదారులు చేసే పొదుపు డిపాజిట్లపై అధిక వడ్డీ (8 శాతం) చెల్లిస్తున్నట్లు ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఉదయకిరణ్ తెలిపారు. శనివారం చౌడువాడ ఏపీజీవీబీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చౌడువాడ బ్యాంకు రూ.50 కోట్ల టర్నోవర్‌తో ముందుందన్నారు. ఈ బ్యాంకు పరిధిలో రూ.21 కోట్ల రుణాలు అందించామని, రూ.29 కోట్లు డిపాజిట్లు సేకరించామని తెలిపారు. సక్రమంగా రుణాలు చెల్లించిన వారికి జీరో వడ్డీ వర్తిస్తుందని చెప్పారు. గ్రామాల్లో పాల శీతలీకరణ కేంద్రాలకు, ఆటో, నాలుగు చక్రాల లగేజీ వాహనాలకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. గృహ రుణాలకు రిజర్వ్ బ్యాంకు ఆదేశాల ప్రకారం 8.5శాతం వడ్డీ వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా ప్రధానమంత్రి బీమా యోజన పథకం కింద గ్రామానికి చెందిన ఐదుగురు నామినీలకు రూ.2 లక్షల చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సురేష్, బ్యాంక్ మేనేజర్ శ్రావణ బాబు, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ఎంపిపి రొంగలి సూర్యనారాయణ, దాట్ల శివాజీ, ఏటుకూరు రాజేష్ పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పరవాడ : జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులు కష్టజీవులు పడుతున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పులు చేసి కార్మికులను యజమానులకు బానిసలుగా అప్పగించే చట్టాలను వ్యతిరేకించాలన్నారు. స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, భవన నిర్మాణం, ముఠా, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో సిఐటియు నాయకులు గేదుల అప్పారావు, పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

హరిరామ జోగయ్య దీక్షకు సంఘీభావం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : కాపు రిజర్వేషన్ల కోసం మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య జనవరి 2వ తేదీన పాలకొల్లులో చేపట్టనున్న నిరవధిక నిరాహార దీక్షకు పూర్తిస్థాయిలో సంఘీభావం తెలియజేస్తున్నట్లు మునగపాక మండల కాపు సంక్షేమ శాఖ యువసేన అధ్యక్షులు పిట్ల మధు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి కాపులకు రిజర్వేషన్లు ప్రకటించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఎంవిఆర్ మాలధారణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు 108 రోజుల పాటు చేపట్టిన శ్రీవెంకటేశ్వర స్వామి మాల ధారణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నరసింగరావుపేటలోని ఆయన గృహంలో ముత్యాల వెంకటేశ్వరరావు సూర్య కుమారి, వారి తనయులు రాజేష్ బాబు, సతీష్ బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెటగుళ్ళు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన ప్రతినిధులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు దంపతులు


నినాదాలు చేస్తున్న నేవీ నిర్వాసితులు

62వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఓబి ఎనిమిది గ్రామాల నిర్వాసితులు మండలంలోని వాడనర్సాపురం నేవీ గేట్ వద్ద నిర్వహిస్తున్న ఆందోళన శనివారం నాటికి 62వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వాసిత నాయకులు మాట్లాడుతూ నేవీ కోసం భూ సేకరణ సమయంలోనూ, తరువాత జెట్టీ నిర్మిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా, నేడు అది సాధ్యం కాదని చెప్పడం దారుణమన్నారు. దీని వల్ల చేపల వేటకు వెళ్లే అవకాశం లేక మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. తక్షణమే జెట్టీ నిర్మాణం చేయాలని, అంద వరకు ఆధార్ ఆధారంగా నేవీ గేట్ గుండా చేపల వేటకు అనుమతించాలని కోరారు. 62 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం, జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'యువ గళం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువ గళం పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, తీరా గెలిచాక జగన్‌రెడ్డి దానిని మర్చిపోయారని ఆరోపించారు. ప్రత్యేక హోదా సాధిస్తామని, తద్వారా ఐదు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పారని, ఇప్పుడు వాలంటీర్లను ఉద్యోగస్తులుగా చెప్పడం దారుణమన్నారు. టిడిపి హయంలో నిరుద్యోగులకు ఇచ్చిన రూ.2000 భతి రద్దు చేశారని, 2021లో 10,413 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ఒక్క పోస్టు భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నారా లోకేష్ జనవరి 27 నుంచి 400 రోజులపాటు నిర్వహించే పాదయాత్రలో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరే సతీష్, ఆకుల నానాజీ, కుప్పిలి జగన్మోహన్, వి.రమణ బాబు, బోడి వెంకటరావు, దూలం ప్రసాద్, బొడ్డేడ మురళి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగజగదీష్ తదితరులు

ఐద్వా ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శనివారం హింస వ్యతిరేకత పరిష్కార మార్గాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్.అరుణ మాట్లాడుతూ సమాజంలో స్త్రీలకు సమాన హక్కు కల్పించాలని, మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్నెట్ల ద్వారా అశ్లీల చిత్రాలను బ్యాన్ చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, మద్యం నియంత్రణ చేయాలని కోరారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి కె.సుభాషిణి, అధ్యాపకులు సుజాత, నాగమణి పాల్గొన్నారు.

13 మందికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న 14మందికి ఆర్థిక సహాయం చేసేందుకు ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయాన్ని శనివారం కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి బాధితులకు అందజేశారు. ఒక్కొక్కరికీ లక్ష రూపాయలు చొప్పున కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆర్థిక సాయం అందుకున్న వారిలో పెదపూడి రిషబ్ బాబి, దేవరకొండ అమర్త్యరామ్, బొండపల్లి నిఖిత, మల్ల రోహిత్, పాము ప్రసాద్, చొక్కా శివ పార్వతి, చింతల ఆకాంక్ష, గన్రెడ్డి నీరజ్, నారం రాజబాబు, అండమూరి ఏసుబాబు, నిడదవోలు సుబ్బలక్ష్మి, పెట్ల పరిమళ, గుడివాడ జాస్మిత, రెడ్డి రామలక్ష్మి ఉన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం చెక్కు అందజేత

కశింకోట : మెదడు ఎదుగుదల లేని బాలుడి వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంజూరైన లక్ష రూపాయల చెక్కును బాలుడి తల్లిదండ్రులకు శనివారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అందజేశారు. మండలంలో గొబ్బూరు గ్రామానికి చెందిన మళ్ల రోహిత్‌కి పుట్టినప్పటి నుంచి మెదడు ఎదుగుదల లేదు. ఆ బాలుడికి వైద్యం అందించడానికి తల్లిదండ్రులకు ఆర్థిక స్తోమతలేదు. తమ బిడ్డ దైయనీయస్థితిని చూస్తూ నిత్యం బాధపడే తల్లిదండ్రులు భాగ్య, యుగంధేశ్వరరావు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి తమ బిడ్డకు మెరుగైన వైద్యానికి సహాయం అందించాలని కోరారు. దీనికి ఆయన వెంటనే స్పందించి నర్సీపట్నం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రోహిత్‌ను చూపించి ఆ బిడ్డ పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి కలెక్టర్‌ను పిలిచి, తక్షణ వైద్య సహాయం కింద లక్ష రూపాయలు అందించాలని ఆదేశించారు. దీంతో రోహిత్ వైద్యం కోసం కలెక్టర్ లక్ష రూపాయలు మంజూరు చేయగా, ఆ చెక్కును శనివారం మంత్రి అమర్నాథ్ రోహిత్ తల్లిదండ్రులకు అందజేశారు. దీంతో రోహిత్ తల్లిదండ్రులు మంత్రి అమర్నాథ్‌కు, కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాను ఎన్నిక అధికారులు శనివారం విడుదల చేశారు. భారత ఎన్నికల సంఘం శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ డినోవో ఓటర్ల జాబితా తయారీకి ఇచ్చిన షెడ్యూల్‌ను అనుసరించి 2022 డిసెంబర్ 30వ తేదీకి తుది జాబితా విడుదల చేసింది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా ఓటర్ల జాబితాను ప్రకటించింది. జిల్లాలోని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో పురుషులు 14,995, స్త్రీలు 8,350, థర్డ్ జెండర్ ఐదుగురు వెరసి 23,350 మంది, నర్సీపట్నం డివిజన్లో పురుషులు 12,338, స్త్రీలు 5406, థర్డ్ జెండర్ ఒకరు వెరసి 17,745 మంది పట్టభద్రుల ఓట్లు ఉన్నారు.



రాజేంద్ర ప్రసాద్ నుంచి ఎన్నిక పత్రం అందుకుంటున్న మోటూరు

ఎపి సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులుగా మోటూరు

ప్రజాశక్తి-పరవాడ : రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులుగా మండలంలోని రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎలమంచిలి బాబురాజేంద్రప్రసాద్ శనివారం నియామక పత్రం అందజేశారు. విజయవాడ బాలోత్సవ భవన్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో ఈ ఎన్నిక జరిగినట్లు మోటూరు సన్యాసినాయుడు తెలిపారు.

లఘు చిత్రాల పోటీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా సాంస్కృతిక, సామాజిక, పర్యాటక సంపద అనే అంశంపై లఘు చిత్రాల పోటీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రవి పఠాన్ శెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల వీడియోల నిడివి ఐదు నుంచి పది నిమిషాలు ఉండాలన్నారు. అనకాపల్లి జిల్లా సహజ సౌందర్యం, ఆధ్యాత్మిక ప్రదేశాలు, సంస్కృతి, చరిత్ర, యుఎస్పి చిత్రీకరించాలని సూచించారు. ఉత్తమంగా నిలిచిన మొదటి మూడు లఘు చిత్రాల విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. జనవరి 20 లోగా అందజేయాలని, ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొవాలని పిలుపునిచ్చారు.

బాలికల హాస్టల్‌ను ప్రారంభించాలి

ప్రజాశక్తి - కె.కోటపాడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్ భవన నిర్మాణం ముగిసి చాలా రోజులైనా నేటికీ ప్రారంభించకపోవడం సరికాదన్నారు. వెంటనే ప్రారంభిస్తే దూరప్రాంతాల బాలికలు ఇక్కడ చదువుకొనేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-దేవరాపల్లి : దళితుల సమస్యలు సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో శనివారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ చట్టాలు, పౌర హక్కులపై అవగాహన కల్పించారు. తహశీల్దార్ దళితుల సమస్యలపై కాలనీ వాసుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీడీఓ సిహెచ్.సుబ్బలక్ష్మి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు, కెవి రమణ, ఆర్ఐ వై.శ్రీనివాసరావు, వీఆర్వోలు బి.నాగేశ్వరరావు నూకరాజు, అంబేద్కర్ యూత్ సంఘం నాయకులు కంచిమాల అప్పారావు, కాటపల్లి అప్పారావు (ఐకెపి), సబ్బవరపు రాజబాబు, ఉల్లి శ్రీను పాల్గొన్నారు.

క్రిస్టియన్ కమ్యూనిటీ హాళ్లు మంజూరుకు వినతి

ప్రజాశక్తి- దేవరాపల్లి : క్రిస్టియన్ల కోసం ప్రతి మండలంలో కమ్యూనిటీ హాళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి ప్రధానమంత్రి మైనారిటీస్ న్యూ 15 పాయింట్స్ ప్రోగ్రాం జిల్లా మెంబర్, నిసి మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ గొర్ల టైటాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నర్సీపట్నం వచ్చిన ముఖ్యమంత్రిని టైటాస్ కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పాస్టర్లకు గౌరవ వేతనం ఇస్తున్న జగన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసే అవకాశం కల్పించిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు టైటస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ముఖ్యమంత్రిని కలిసిన నిసి మినిస్ట్రీస్ డైరెక్టర్ టైటాస్

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-కశింకోట

ప్రజల సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం కసింకోటలోని రెల్లివీధి, మేదర వీధి ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఒక పేద కుటుంబ వద్దకు మంత్రి వెళ్లగా, శిథిలావస్థకు చేరుకున్న తమ ఇంటిని మంత్రికి చూపించి తమకు పక్కా ఇంటిని మంజూరు చేయాలని కోరారు. దీంతో మంత్రి అక్కడే ఉన్న అధికారులను పిలిపించి, వీరికి పక్కా ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన ఏర్పాటు చూయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాస్, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయ రజని, వైసిపి నాయకులు మళ్ళ బుల్లి బాబు, మలసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'టిడిపి పాలనలో రాష్ట్రం సుభిక్షం'

ప్రజాశక్తి- దేవరాపల్లి

టిడిపి అధినేత చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు కందుకూరు మృతులకు తీవ్ర సంతాపం తెలిపి, మౌనం పాటించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజధాని లేని రాష్ట్రానికి ఇదేమి కర్మ అంటూ నినాదాలు చేశారు. అనంతరం రామానాయుడు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేసే నాయకుడు చంద్రబాబు అని తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, వైసిపి నుంచి ప్రజలు రక్షించబడాలంటే 2024 ఎన్నికల్లో టిడిపిని తిరిగి అధికారంలోకి తీసుకురావడం ఒకటే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరకాన సూర్యనారాయణ, పెద్దాడ వెంకటరమణ, పూడి సత్యారావు, సోమిరెడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.



ఇదేం ఖర్మ మన రాష్టానికి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

సమగ్ర రీ సర్వేతో భూముల పరిరక్షణ

ప్రజాశక్తి-సబ్బవరం

సమగ్ర భూ రీ సర్వే ద్వారా రైతుల భూములకు పరిరక్షణ ఉంటుందని బంగారమ్మ పాలెం ఎంపీటీసీ రాపేటి అరుణ రాము అన్నారు. శనివారం ఆ గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ తమ గ్రామ పంచాయతీలో అనేక మంది రైతులు భూములు కలిగి ఉన్నప్పటికీ వారికి రికార్డును నమోదు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న వారికి సాధికారిక సర్వే ద్వారా సాగు హక్కు కల్పించే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిరాయితి పట్టా భూములు ఉన్నవారు కూడా సమస్య ఏమైనా ఉంటే ఈ సాధికార సర్వే ద్వారా వాటిని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, దొడ్డి కన్నంనాయుడు, కోరుమిల్లి నూకరాజు, సూరిశెట్టి రాము, శరగడం వెంకట్రావు, కిల్లి సత్యనారాయణ, దొడ్డి శ్రీనివాసరావు, దొడ్డి వెంకటరమణ, దార రాము, డిటి వెంకట్, స్పెషల్ డీటీ రమేష్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకులు పిరాట్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల జీవిత చరిత్రలు విద్యార్థులకు అవగతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.కామేశ్వరరావు, కె.నాగేష్, వివి సన్యాసిరావు, సందీప్ శర్మ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గంగాధర్ రావు, పి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేసిన నిర్వాహకులు

బొజ్జన్న జాతర ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎంపీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద కనుమ పండగ రోజు జరగనున్న జాతరకు చేస్తున్న ఏర్పాట్లను ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, సర్పంచు పసుపులేటి లక్ష్మీ రామకృష్ణతో కలసి శనివారం పర్యవేక్షించారు. కొండకు విద్యుద్దీకరణ పనులు, మంచి నీటి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు, ప్లంబింగ్, పెన్సింగ్, రంగులు వేయడం వంటి పనులను పరిశీలించారు. సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు, బాలింతల కోసం బేబీ ఫీడింగ్ రూము ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహోదయ, పోలమరశెట్టి సన్యాసి నాయుడు, టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పీలా బుజ్జి పాల్గొన్నారు.



ట్యాబ్‌లు చూపిస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం ఎంపియుపి పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులు 20 మందికి ట్యాబ్‌లను సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు, ఎంపీటీసీ రాపేటి అరుణ రాము శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మరింత మంచి భవిష్యత్తు అందించేందుకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కన్నంనాయుడు, కోరుమిల్లి నూకరాజు, కిల్లి సత్యనారాయణ, దొడ్డి శ్రీనివాసరావు, దొడ్డి వెంకటరమణ, ధార రాము, డిటి వెంకట్, స్పెషల్ డిటి రమేష్ పాల్గొన్నారు.

కొత్తగా 261 పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండలంలో వైయస్సార్ ఆసరా పథకం కింద కొత్తగా 261 పింఛన్లు మంజూరు చేసినట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ఎఎస్.పేటలో 23, అచ్చర్లలో 7, బయ్యవరంలో10, చింతలపాలెంలో 15, ఇ.చౌడువాడలో 14, జి.భీమవరంలో 17, జమౌదులపాలెంలో 19, కశింకోటలో 62, కొత్తపల్లిలో 6, ఎన్‌జి పాలెంలో 16, తాళ్ళపాలెంలో 14, త్యేగాడలో 5, తీడలో 8, ఉగ్గిని పాలెంలో 19, వెదురు పర్తిలో 10, జె.తునిలో 16 మంజూరైనట్లు వెల్లడించారు. ఈ లబ్ధిదారులకు జనవరి నెల నుంచి పింఛన్లు పంపిణీ జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి పెన్షన్ వారోత్సవాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా జనవరి 1 నుండి 7వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెన్షన్ కోసం ప్రభుత్వం రూ.1765 కోట్లు ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వాలంటీర్లు పెన్షనర్ల ఇంటి వద్దకు వచ్చి పంపిణీ చేస్తారన్నారు. సాంకేతిక కారణాలవల్ల ఏ ఒక్కరికి పెన్షన్ అందలేదని ఫిర్యాదు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

టిడిపి బిసి సెల్ కో-ఆర్డినేటర్‌గా భీమరశెట్టి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : టిడిపి బిసి సెల్ పార్లమెంటు నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన భీమరశెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీలు అణగదొక్కబడుతున్నారని, పార్టీ శ్రేణులను కలుపుకొని వారి సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. తనకు ఈ పదవి అప్పగించిన టిడిపి అధినేత చంద్రబాబుకు, యువ నాయకులు లోకేష్‌కు, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.



మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ డివివి.గోపాలరాజు జన్మదిన వేడుకలు శనివారం తుమ్మపాలలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పంచదారల కన్నారావు, పంచాయతీ పాలకవర్గ సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో నిస్వార్ధంగా పనిచేసిన గోపాలరాజు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మొగసాల లక్ష్మి, వెంకట్, వార్డు మెంబర్లు తత్ర సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



గోపాలరాజుకు కేక్ తినిపిస్తున్న పెంటయ్యనాయుడు తదితరులు



సాయం అందజేస్తున్న ఎపిఒ ఈశ్వరరావు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని న్యాయంపూడి గ్రామానికి చెందిన కొత్తల నాగేశ్వరరావు ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నాడు .డిసెంబర్ 19న ఆయన అకాల మృతి చెందాడు. ఈ మేరకు ఉపాధి పథకం ఎపిఒ ఈశ్వరరావు ,కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి రూ.30 వేలు సమకూర్చి, నాగేశ్వరరావు భార్యకు ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచారు.

దిగజారుడు వ్యాఖ్యలు సిగ్గుచేటు

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం సిఎం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర ఆరోపించారు. శనివారం ఎన్‌జిఒ హోమ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నర్సీపట్నంలో సభలో పవన్ కళ్యాణ్‌పై సీఎం జగన్ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని ప్రజలకు, కౌలు రైతులకు దత్తపుత్రుడని, కానీ సిఎం జగన్ సిబిఐ దత్తపుత్రుడని విమర్శించారు. 33 కేసుల్లో నిందితుడిగా, 16 నెలలు జైల్లో ఉన్న జగన్మోహనరెడ్డి ఏ మచ్చలేని. పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. పాదయాత్రలో, ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల అమలులో మోసంచేసిన సిఎం జగన్ భాష, యాసను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు.

ట్యాబ్‌లతో మేలు

ప్రజాశక్తి - రావికమతం : భావి విద్యార్థుల భవిష్యత్తుకు ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ అన్నారు మండలంలో తట్టబంద గ్రామ పంచాయతీ సాయినగర్ పాఠశాలలో 11 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. పిఎంసి ఛైర్మన్ దాసరి తాతారావు, మాజీ ఎంపిటిసి బియ్యపు సత్యారావు, గణేష్, నాయుడు, పరదేశి నాయుడు, సింబోతు చిన్నబ్బాయి, సత్తిబాబు, ఎస్. శివ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఉపమాక వెంకన్న

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం గరుడ వాహనంపై శ్రీనివాసుడు, పల్లకిలో గోదాదేవి అమ్మవారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు ఆలయ ప్రధానార్చకుల గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కష్ణమాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, పీసపాటి వేంకట శేషాచార్యులు, నండూరి వేంకట రాజగోపాలాచార్యులు, దేవస్థానం సిబ్బంది గురవయ్య, టిటిడి విజిలెన్స్ సిబ్బంది కుమార్, శ్రీవారి సేవకులు నున్న సుభాష్ , సిద్దాబత్తుల కష్ణ పలువురు భక్తులు పాల్గొన్నారు.

279 కొత్త పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలానికి కొత్తగా 279 సామాజిక పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ చంద్రశేఖర్ తెలిపారు, మంజూరైన పింఛన్లు జనవరి 3 నుంచి నిర్వహించనున్న పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

అమ్మపేటలో పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని అమ్మపేట గ్రామ పంచాయతీలో సర్పంచ్ నిద్ర దేవుడునాయుడు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని మండల అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డేవిడ్‌రాజు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అధికారులు గ్రామ పంచాయతీ పాలక మండలికి నిర్భయంగా తెలియజేయాలన్నారు కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.అప్పారావు, గొలుగొండ ఎస్ఐ నారాయణరావు, ఆర్ఐ నాగరాజు, పంచాయతీ సెక్రెటరీ, విఆర్ఒ, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఆదేశాల్లేవట..!

అధికారుల తీరుపై నేతలు, రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి-కోటవురట్ల : ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు అందలేదని స్థానిక వ్యవసాయాధికారి అరుణ కుమారి చెప్పడంపై స్థానిక నాయకులు ఆగ్రహం చేశారు, శనివారం స్థాని రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్‌పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, స్థానిక ఎంపిటిసి సూర్యారావు . ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యంపై సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 15 రోజులు కావస్తున్నా, నేటికీ కొనుగోలు చేపట్టక పోవడంపై మండిపడ్డారు. ధాన్యం కొనుగోలుకు ఇంతవరకు ఆదేశాలు అందలేదని ఎఇ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం బాధ్యతారాహిత్య మేనన్నారు. మండల వ్యాప్తంగా నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, నేటికీ కేంద్రాల వద్ద ఆరకొరగానే కొనుగోలు చేస్తున్నారని రైతు భరోసా సిబ్బంది సైతం ఎవరు పట్టించుకోలేదని ఆరోపించారు. కనీసం రైతులకు గోనె సంచులు కూడా ఇవ్వలేని స్థితిలో ఉండడం దారుణమన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు

తుస్సుమన్న అధికార పార్టీ నేతల హామీ

నిర్వాసితుల సమస్యలపై నోరుమెదపని సిఎం జగన్ : ఎర్రాపాత్రుడు



విలేకరులతో మాట్లాడుతున్న ఎర్రపాత్రుడు

ప్రజాశక్తి-మాకవరపాలెం : ఆన్‌రాక్ కంపెనీలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు రెండు సెంట్ల స్థలం ఇస్తామని స్థానిక అధికార నేతలు హామీ ఇచ్చినప్పటికీ దీనిపై సిఎం జగన్ ఎటువంటి ప్రకటన చేయకుండా షాక్ ఇచ్చారని ఆన్‌రాక్ సమస్యలపై ఉద్యమకారుడు, బూరుగుపాలెం టిడిపి ఎంపిటిసి రత్తుల ఎర్రాపాత్రుడు ఆరోపించారు. శనివారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఆన్‌రాక్ నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. భూములు కోల్పోయిన 2450 మంది నిర్వాసితులకు పశువుల పాకలకు రెండేసి సెంట్లు స్థలం, స్థానికులకు ఉద్యోగాలు , ఆర్ కార్డులు జారీ, భూమి అభివృద్ధి పథకం కింద భూమిని ఇస్తామని నమ్మబలికినప్పటికీ నేటికీ వాటిపై పట్టించు కోలేదన్నారు. అధికారపార్టీ నేతల ప్రకటనలకు, ముఖ్యమంత్రి జగన్ స్పందనకు పొంతన లేదన్నారు. దీనిపై వారం రోజుల్లోగా స్పష్టత రాకుంటే, నిర్వాసితులకు న్యాయం జరిగేవరకు ఆందోళన చేస్తానని హెచ్చరించారు.కార్యక్రమంలో టిడిపి సర్పంచ్ రమణ,మాజీ సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు

కరోనా పట్ల అప్రమత్తత అవసరం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : కరోనా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. శనివారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, పార్టీ కుటుంబ సభ్యులందరికీ, ప్రజలు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కోవిడ్ నాలుగో వేవ్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే నూతన సంవత్సర వేడుకలకు తాను అందుబాటులో ఉండడం లేదన్నారు. ని, నర్సీపట్నం నియోజకవర్గంలోనే సుమారు 250 మంది కరోనాతో చనిపోయారని గుర్తు చేశారు. రాబోయే పండుగ రోజుల్లో ప్రజలు వ్యక్తిగతంగా తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి ఏదో చేస్తాడని, ఉద్ధరిస్తాడని అనుకోవద్దని,జగన్ ప్రభుత్వాన్ని నమ్మవద్దని హెచ్చరించారు. గతంలో కరోనా సమయంలో ఆహారం, మందులు, మాస్క్‌లు సరఫరా చేసిన వారికి నేటికీ డబ్బులు చెల్లించలేని దౌర్భాగ్యస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని ప్రజలు గమనించి, ఎవరికి వారే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

శాప్ జిల్లా స్థాయి బాక్సింగ్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం మినీ స్టేడియంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అనకాపల్లి చీఫ్ కోచ్ ఎన్.సూర్యారావు ఆదేశాల మేరకు నర్సీపట్నం శాప్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శాప్ బాక్సింగ్ లీగ్ జిల్లాస్థాయి బాక్సింగ్ టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. సబ్ జూనియర్ బాలుర, బాలికల విభాగంలో 40 మంది పాల్గొనగా అందులో 10 మంది బాలురు, ఆరుగురు బాలికలు స్టేట్ శాప్ లీగ్‌కు ఎంపిక చేశారు. అండర్- 14 విభాగంలో 32 మంది గోల్డ్ సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరికి నింజాస్ అకాడమీ డైరెక్టర్ పారుపల్లి శ్రీనివాస్, వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాప్ కోచ్ కె. అబ్బు, సీనియర్ కోచ్ శేఖర్ పాటు అ నకాపల్లి, పాయకరావుపేట రిఫరీలు కె.అరుణ, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సుబ్బారావు, తదితరులు

గీత దాటితే కఠిన చర్యలు..!

ప్రజాశక్తి- రావికమతం : నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలో ప్రతి పంచాయతీలోనూ పోలీసుల నిఘా ఉంటుందన్నారు. మద్యం మత్తులో గొడవలు, ఘర్షణలు, తగువులు, కొట్లాటలు, ఇటువంటి సంఘటనలు ఎక్కడ జరిగినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉల్లాసభరిత వాతావరణంలో ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

రోలుగుంట: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రోలుగుంట ఎస్ఐ నాగకార్తీక్ హెచ్చరించారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని నిర్వహించే వేడుకల్లో యువత, ప్రజలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాత్రి 12:30 గంటలు దాటాక రోడ్డుపై ఎవరున్నా కేసులు పెడతామని హెచ్చరించారు. మద్యం మత్తులో గొడవలకు పాల్పడడం, బైక్ రేసింగ్‌లు, బాణసంచా కాల్చడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

దేవరాపల్లి :నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని దేవరాపల్లి మండలంలోని గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలపై తిరిగినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ దాసరి నాగేంద్ర హెచ్చరించారు. కోడిపందాలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి దొరికినట్లయితే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. నూతన సంవత్సర వేడుకలు ఇళ్లల్లో జరుపుకోవాలని, మందు గుండు కాల్చవద్దని సూచించారు.

నరేష్‌పై పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐ శిరీషకు ఫిర్యాదు చేస్తున్న అయ్యప్పస్వామి దీక్షాపరులు

ప్రజాశక్తి- నక్కపల్లి : అయ్యప్పస్వామి జననంపై అసభ్యకర వ్యాఖ్యలు చేసి, కోట్లాది మంది అయ్యప్పదీక్షాపరులతోపాటు, హిందువుల మనోభావాలను కించపరిచిన బైరి నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అయ్యప్ప దీక్షాపరులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ, నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శిరీషకు విన్నవించారు.

ఒక సమావేశంలో ఉద్దేశ్యపూర్వకంగా అయ్యప్పస్వామిని, హిందూమతాన్ని హేళన చేస్తూ మాట్లాడడం ద్వారా నరేష్ వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో అయ్యప్ప దీక్షాపరులు కారే తాతారావు, చోడిపల్లి దేవుడు,పేర్ల శ్రీను,కోడ నూకరాజు,వాసుపల్లి శివ,కోడ లోవరాజు, పిక్కి అప్పలరాజు,పిక్కి ప్రసాద్, కోడ త్రినాథ్,దేలపల్లి కాశి, కోడ నాగు,వాసుపల్లి నూకరాజు, మైలపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత ప్రపంచం కోసం యువకుని సైకిల్ యాత్ర

ప్రజాశక్తి -నక్కపల్లి : పొల్యూషన్ ఫ్రీ వరల్డ్ కోసం కోల్‌కత్తా కు చెంది సుదీప్ దాస్ అనే యువకుడు నవంబరు 24న సైకిల్ యాత్ర ప్రారంభించాడు. ఈ సైకిల్ యాత్ర శనివారం మధ్యాహ్నం నక్కపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా సుదీప్ మాట్లాడుతూ కాలుష్య రహిత ప్రపంచం కోసం ప్రజల్లో అవగాహనకు ఈ సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపాడు. రోజుకు సగటున 50 నుంచి 60 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నానని, రాత్రివేళల్లో ఆలయాలు, బస్‌స్టాండ్ వద్ద నిద్రిస్తున్నానన్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా, రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర పూర్తిచేశానని, మరో ఆరు నెలల పాటు సైకిల్ యాత్ర కొనసాగిస్తానన్నారు.



సైకిల్ యాత్ర చేస్తున్న సుదీప్‌దాస్

మహిళల హక్కుల సాధనకు ఐద్వా నిరంతర పోరాటం




ఐద్వా జెండా ఆవిష్కరణలో సూర్యప్రభ, తదితరులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మహిళలు, విద్యార్థినులు హక్కులు, వారి సమస్యలపై ఐద్వా నిరంతరం పోరాడుతుందనిఐద్వా నాయకురాలు కెవి సూర్యప్రభ అన్నారు. ఈనెల 6 నుంచి 9వ వరకు కేరళలో అఖిల భారతఐద్వా మహసభలు జరగనున్న నేపథ్యంలో శనివారం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే మహిళలకు సాధికారత ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు లేవన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు పరిశ్రమల ఏర్పాటు అవసరమని, అయితే ప్రస్తుత ప్రభుత్వాల స్టీల్ ప్లాంట్, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, బ్యాంక్‌లు, రైల్వే వంటి ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమలను ప్రయివేటుకు ధారదత్తం చేయాలని చూస్తున్నాయని దుయ్యబట్టారు. పనిప్రదేశంలో మహిళలకు భద్రత లేదన్నారు. మహిళలు హక్కులు, సమానత్వం, ఉపాధి అవకాశాలకు ఐద్వా పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. మహసభలను జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా డివిజన్ నాయకులు వి.సామ్రాజ్యం ,అదిలక్ష్మి ,భవాని పాల్గొన్నారు.

సూక్ష్మ కళాకారుల ప్రతిభ





చెక్క పెన్సిల్ ముల్లుపై నూతన సంవత్సరానికి ఆహ్వానం

ప్రజాశక్తి -నక్కపల్లి : తన సూక్ష్మకళ నైపుణ్యంతో నూతన సంవత్సరానికి సూక్ష్మ కళాకారులు స్వాగతం పలికారు. చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ తన సూక్ష్మ కళతో పెన్సిల్ ముల్లుపై 2023 చెక్కి నూతన సంవత్సరానికి స్వాగతం పలికాడు.మరో సూక్ష్మ కళాకారుడుదార్ల రవి చెక్కపై 2022నుంచి2023 సంవత్సరంలోకి అడుగు పెడుతున్నట్లు చెక్కపై చెక్కి తన సూక్ష్మ కళను ప్రదర్శించాడు.

ఖండివరం సర్పంచ్‌కు పతి వియోగం

ప్రజాశక్తి- చీడికాడ: మండలంలోని ఖండివరం సర్పంచ్ శ్రీరంరెడ్డి లక్ష్మి భర్త చిట్టినాయుడు మృతి చెందారు. కొద్దిరోజులుగా కేన్సర్‌తో బాధపడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిట్టి నాయుడు మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



చిట్టినాయుడు (ఫైల్‌ఫోటో)

చిట్టినాయుడు మృతి సమాచారం తెలుసుకున్న నియోజవర్గ టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు, టిడిపి ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు వచ్చి, చిట్టినాయుడు పార్థీవదేహానికి నివాళు లర్పించారు. చిట్టినాయుడు మృతదేహానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల రద్దు నోటీసులపై నిలదీత

▸▸ సమాధానానికి తత్తరపడిన అధికారపక్షం, అధికారులు

▸▸ మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాస

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ గుడిబండి ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం రసాభాసగా ముగిసింది. తెలుగుదేశం కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పకుండానే ముగిసిపోయింది. మొదటగా అజెండా చదివిన వెంటనే తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ శ్రీకాంత్ లేచి వితంతు, వద్దాప్య, వికలాంగ పింఛన్లను రద్దు చేస్తున్నట్లు లబ్ధిదారులకు నోటీసులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నలు కురిపించారు. నోటీసులు ఇచ్చిన లబ్ధిదారులకు పింఛన్లు కొనసాగిస్తారా? లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని కోరారు. అర్హతల విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం, దర్యాప్తు చేస్తుండడంలో ఇప్పటికే పింఛన్లు పొందుతున్న పలువురు లబ్ధిదారుల్లో భయాందోళనలు నెలకొన్నా యన్నారు. భవిష్యత్తులో రేషన్ కార్డులు తొలగిస్తున్నట్లు సమాచారం ఉందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

జనసేన పార్టీ కౌన్సిలర్ సౌజన్య మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్యం లోపించిందని వీధుల్లో పేరుకుపోయిన చెత్త తొలగించడం లేదని, తన మొబైల్‌లో తీసిన ఫోటోలను కౌన్సిలర్ సమావేశంలో అందరికీ చూపించారు. ప్రస్తుతం కోవిడ్ నాలుగో వేవ్ హెచ్చరికల



సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడుతున్న కౌన్సిలర్లు



సభలో అపారిశుధ్య ఫోటోలు చూపుతున్న కౌన్సిలర్ సౌజన్య

నేపథ్యంలో వార్డు ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . దీనిపై పాలక పక్షం నుండి సరైన సమాధానం రాకపోవడంతో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు ఆందోళనకు దిగారు. చైర్‌పర్సన్, కమిషనర్లను టిడిపి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. దీనికి కమిషనర్ విచారణ కొనసాగుతుందని దాటవేత ధోరణిలో సమాధానమిచ్చి అయిందనిపించారు.

సభ నుండి బయటకు వచ్చిన తర్వాత మీడియాతో దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ పెన్షన్ల రద్దుకు నోటీసుల జారీపై అధికారులు, మున్సిపల్ పాలకమండలి ఎటువంటి సమాధానం చెప్పలేదన్నారు. ఒక్కటొక్కటిగా అన్ని పెన్షన్లు, పథకాలకు వైసిపి ప్రభుత్వం మంగళం పాడేస ఆఖరికి పెన్షన్ కూడా తొలగిస్తారని శ్రీకాంత్ విమర్శించారు. కౌన్సిలర్ రామరాజు, అయ్యన్న తనయుడు కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ పెన్షన్దారులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అన్నారు.

చివరగా చైర్‌పర్సన్ ఆదిలక్ష్మిని వివరణ కోరగా జనసేన కౌన్సిలర్ సౌజన్య మాటతీరు బాగోలేదని, తాము సమాధానం చెబుతున్నప్పటికీ, విపక్ష కౌన్సిలర్ల తీరు బాగోలేకపోవడంతో సభను ముగించేశామన్నారు.

డివైఎఫ్ఐ గ్రీటింగ్ కార్డులు, పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్(విశాఖ) : డివైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ రూపొందించిన గ్రీటింగ్ కార్డులు, పోస్టర్లను శనివారం జగదాంబ దరి ఎన్‌పిఆర్ భవన్‌లో సంఘం రాష్ట్ర నాయకులు యుఎస్ఎన్.రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిందని, వారి మాట ప్రకారం ఇప్పటికే 16 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉండాలని, కానీ వాస్తవంలో ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని, ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగ భద్రతతో పాటు రిజర్వేషన్లు కూడా లేకుండా పోతాయని తెలిపారు. ఇది బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్ర అన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరిట యువతను మోసం చేసిందన్నారు. ఈ మధ్యకాలంలో కొన్ని వేల పోస్టులు పోలీసు శాఖలో భర్తీ చేయాల్సి ఉండగా కేవలం ఆరు వేల పోస్టులను మాత్రం తీసి అన్యాయం చేసిందన్నారు. డివైఎఫ్ఐ పోరాటం చేయడంతో వయోపరిమితిని రెండు సంవత్సరాలకు పెంచారని, దీన్ని కనీసం ఐదు సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.



గ్రీటింగ్ కార్డులు, పోస్టర్ ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నేతలు

విశాఖపట్నం కేంద్రంగా డ్రగ్స్ మాఫియా నడుస్తోందని, చిన్నపిల్లలు, విద్యార్థులు, యువకులు బానిసలు అవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని కట్టడి చేయడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పై అంశాలను దృష్టిలో పెట్టుకొని 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం, డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు' అన్న నినాదాలతో గ్రీటింగ్ కార్డులను రూపొందించామన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు డివైఎఫ్ఐ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షులు శ్రావణ్, సహాయ కార్యదర్శి విజయ, గణేష్ పాల్గొన్నారు.

పలుచోట్ల నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కశింకోట : పిఆర్‌టియు 2023 క్యాలెండర్‌ను రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు వెన్ను దన్నుగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు డి గోపినాథ్, కె.విశ్వేశ్వరరావు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడ : మండల కేంద్రంలో జనసేన వారియార్స్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండరును శనివారం ఆవిష్కరించారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలోని అన్ని పంచాయతీల్లో క్యాలెండర్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నక్కపల్లి : ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీలను శనివారం సాయంత్రం అడ్డురోడ్డులోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆవిష్కరించారు. సంఘ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్ రాయవరం మండలాల ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి కొండలరావు, అప్పలరాజు, కిల్లాడ శ్రీను, మోహన్ గంగాధర్, ధర్మారావు, సునీల్, శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇగ్నో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2023 విద్యాసంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతోపాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన జారీ చేశారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్ డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ సహా అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ అడ్మిషన్లను ఆన్‌లైన్ ద్వారా పొందవలసి ఉంటుందని ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనెపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ https://ignouadmission.samarth.edu ద్వారా ఇతర వివరాలు పొందవచ్చునని పేర్కొన్నారు. అన్ని కోర్సుల్లో ప్రవేశాలకు గడువు 31 జనవరి 2023 అని, విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుందని వెల్లడించారు. ఫీజులు కూడా ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుందని, ఎంపిక చేసిన కోర్సుల్లో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి సఫ్దర్ హష్మీ వర్ధంతి సభలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజా కళాకారుడు, వీధి నాటక ప్రయోక్త సఫ్దర్ హష్మీ 33 వర్ధంతి సభలు విశాఖ నగర వ్యాపితంగా ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చంటి, గుర్రం రమణ, గౌరవ అధ్యక్షులు దండు నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు, మహిళలు, విద్యార్థులు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు వారి హక్కుల కోసం చేస్తున్న పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలకు ప్రజానాట్యమండలి తమ ఆటా పాటలతో వారికి తోడుగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణ కోసం, కార్మికులకు నష్టం కలిగించే ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా వీధి నాటికలు, పాటలు రచించి అనునిత్యం ప్రజల మధ్య కళా ప్రదర్శనలు ఇస్తున్నామని తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న ఆందోళనా కార్యక్రమానికి, ఉద్యమానికి సంఘీభావం తెలియజేస్తూ పాటలు, కోలాటం, వీధి నాటికలతో ప్రచారం నిర్వహించామని తెలిపారు. హష్మీకి ఘన నివాళి అర్పించేందుకు స్టీల్‌ప్లాంట్, గాజువాక, మల్కాపురం, కంచరపాలెం, పెందుర్తి, గోపాలపట్నం, మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ, భీమిలి వంటి ప్రాంతాల్లో హష్మీ వర్ధంతి సభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, కళాకారులు, నటులు, వాయిద్య కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 2న ఆర్‌కె.బీచ్‌లో ఘనంగా కళా ప్రదర్శనలు, అనంతరం హష్మీ వర్ధంతి సభ నిర్వహించి నివాళి అర్పిస్తామని తెలిపారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పేద, బడుగు బలహీన వర్గాలకు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అమూల్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు కొనియాడారు. శనివారం మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవ చేయాలనే సత్సంకల్పంతో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు పక్కి దివాకర్, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు యతిరాజుల నాగేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు పైడి శ్రీనివాస్, బెందాళం పద్మావతి పాల్గొన్నారు.

ఆర్‌టిసి పురోభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : సురక్షితంగా ప్రయాణికులను గమ్యాన్ని చేర్చే ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించడం ద్వారా సంస్థ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని నర్సీపట్నం ఆర్‌టిసి డిపో మేనేజర్ ధీరజ్ కోరారు. ప్రయాణ సమయంలో సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. అదే సమయంలో సిబ్బంది కూడా ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల ఆదరణతోనే ఆర్‌టిసి నడుస్తోందని, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించాలని అదేస్థాయిలో ప్రజల నుంచి సహకారం అవసరమన్నారు. ప్రమాదభరిత ప్రయివేటు వాహనాల ప్రయాణాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.